మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: త్వరలో జరగబోవు మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జేఏసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ ఛైర్మన్ వేల్పుల సంజయ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలకు అన్నిటా మోసగించిందన్నారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇచ్చి చేతల సీఎం అని నిరుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రమేష్, లక్ష్మణ్, అంబేద్కర్, అఖిల్, సంపంగి, నరేందర్, రాజేష్, శివశంకర్, సత్యం, చరణ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఓయూ వీసీ'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంబంధిత విభాగం ప్రొఫెసర్లు ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. ఐదు నెలలుగా వీసీ, రిజిస్ట్రార్‌ను కలవాలని ప్రయత్నిస్తున్నా అనుమతి ఇవ్వడం లేదన్నారు. దీంతో మనస్తాపనికి గురైన ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ. సునీల్, ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ సెక్రెటరీ ప్రొ.దీప్లా తమ పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాజమండ్రిలో జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం ప్రమాదం కాదని ముమ్మాటికీ హత్యే అని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విలేకరుల సమావేశంలో దళిత బహుజన స్టూడెంట్స్ అసోసియేషన్ స్టేట్ కోఆర్డినేటర్ జంగిలి దర్శన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మరణం పై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. పాస్టర్ మృతికి సీఎం చంద్రబాబునాయుడు బాధ్యత వహించాలని ఏపీ కూటమి ప్రభుత్వంలో క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు.

పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

రసూల్‌పురా: రంజాన్ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం రెండు, మూడవ వార్డుల్లో పేద ముస్లిం కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ఎస్. ముకుల్ నిత్యావసర సరకులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ వేడుకలు ఐక్యతను పెంపొందింపజేస్తాయి


ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్న కోట నీలిమ, మైనంపల్లి హనుమంతరావు

సనత్‌నగర్: ఇఫ్తార్ వేడుకలు ఐక్యతను ప్రతిబింబిస్తాయని ఏఐసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బేగంపేటలో యువనేత అభిషేక్ అడపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ వేడుకలకు ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్‌తో ముస్లిం ఉపవాస దీక్షలను విరమింపజేశారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

వాటర్ వర్క్స్ మేనేజర్


నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న తార్నాక వాటర్ వర్క్స్ మేనేజర్ మహమ్మద్ ఆసీఫ్ అలీ

లాలాపేట: మానవ మనుగడకు జీవనాధారమైన నీటి సంరక్షణ మనందరి బాధ్యత అని తార్నాక వాటర్ వర్క్స్ మెనేజర్ మహమ్మద్ ఆసీఫ్ ఆలీ అన్నారు. జలమండలి, జననీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తార్నాకలో వరల్డ్ వాటర్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ సమీపంలో ఉన్న ఇంకుడు గుంత వద్ద నీటి పొదుపు ప్రతిజ్ఞ చేశారు. అక్కడి నుంచి నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాపారావు, జననీ ఫౌండేషన్ ఎన్‌జీఓ ప్రతినిధి మల్లేష్, నాగార్జున నగర్ వాసులు ప్రసాద్ తదితరులున్నారు.

అంతా మా ఇష్టం..!

కార్యాలయంలో ఉండరు... ఫీల్డుకు వెళ్లరు


జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు తిష్ట వేస్తున్న బీఎస్‌ఆర్ గార్డెన్

- నామాలగుండు ప్రైవేటు గార్డెన్‌లో సిబ్బంది తిష్ట
- ఇక్కడి నుంచే ట్యాక్స్ విభాగం సేవలు
- సాయంత్రం వరకు గార్డెన్‌లోనే అడ్డా
- సీతాఫల్‌మండిలో 'జీహెచ్‌ఎంసీ' తీరు

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలు ఉన్నప్పటికీ పౌర సేవలను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం వార్డు కార్యాలయాలను అందుబాటులోకి తెచ్చింది. ఉదయం అంతా ఫీల్డ్ వర్క్ చేసుకుని మధ్యాహ్నం నుంచి వార్డు కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్నది వార్డు కార్యాలయాల ఏర్పాటు లక్ష్యం.

- నగరంలోని అన్ని డివిజన్ల మాదిరిగానే సీతాఫల్ మండిలోనూ జీహెచ్‌ఎంసీ అధికారులు వార్డు కార్యాలయాన్ని నామాలగుండులో ఏర్పాటు చేశారు. ఏడాది గడిచిపోయినా సదరు వార్డు కార్యాలయంలో తనకు వీలున్న సమయంలో మాత్రమే అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆసీనులవుతున్నారు మినహా ఇతర ఉద్యోగులు వార్డు కార్యాలయంలో కనిపించడం లేదు.

ప్రైవేట్ గార్డెన్ అడ్డాగా..

ఇదిలా ఉండగా నామాలగుండులోని జీహెచ్‌ఎంసీ కమ్యునిటీహాలులో అధునాతన వసతులతో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయంలో ఉండాల్సిన ఉద్యోగులు సమీపంలోని బీఎస్‌ఆర్ గార్డెన్ (ప్రైవేటు ఫంక్షన్‌హాలు)లో తిష్ట వేస్తున్నారు. ముఖ్యంగా ట్యాక్సు, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బందికి ఈ ప్రైవేటు గార్డెన్ అడ్డాగా మారింది.

- ఉదయం 10 గంటలకు ఒక్కొరొక్కరుగా ఇక్కడికి చేరుకుంటున్న అధికారులు, ఉద్యోగులు వాహనాలు పార్కింగ్ చేసుకుని గార్డెన్‌లో ఆసీనులు అవుతున్నారు. పనికొచ్చే పనులు వచ్చిన సందర్భాల్లో అలా ఇన్‌స్పెక్షన్ పేరుతో బయటకు వెళ్లి తిరిగి వచ్చి ఇక్కడికే చేరుకుంటున్నారు.
- గార్డెన్‌లోనే లంచ్ చేసుకుని అలా ఓ కునుకు తీస్తున్నారు. ఈ రెండింటి తరువాత అసెస్‌మెంట్లు, పన్ను చెల్లింపుల సమస్యలు ఉన్న వ్యక్తులను నేరుగా ఇదే గార్డెన్‌కు రప్పించుకుని ఇక్కడే రశీదులు కట్ చేస్తున్నారు. ఆ మీదట విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరుతున్నారు.

కార్మికుల ఫొటోలు ఇక్కడే

ఎక్కడ విధులు నిర్వహిస్తారో... ఎక్కడి నుంచి వస్తారె తెలియదు కానీ మధ్యాహ్నం అయిందంటే చాలు గుంపులు గుంపులుగా పారిశుద్ధ్య కార్మికులు ఫోటోలు దిగడం కోసం ఇదే గార్డెన్‌కు చేరుకుంటారు.

- వారంతా గార్డెన్ ఆవరణకు చేరుకొని క్యూ కట్టిన మీదట ఐదు నిమిషాల్లో చకాచకా అటెండెన్స్ ఫోటోలు తీసుకునే కార్యక్రమం పూర్తి చేస్తాడు. ఆ వెంటనే కార్మికులు, పర్యవేక్షకుడు అందరూ ఇంటిదారి పడతారు.



'ఆరోగ్యశ్రీ'లో నమోదు చేసుకోండి

ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో డీఎంహెచ్‌ఓ


సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్

గాంధీఆస్పత్రి: 30 అంతకంటే ఎక్కువ పడకలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులను రాజీవ్ ఆరోగ్యశ్రీలో నమోదు చేసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ వెంకట్ ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలను కోరారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సహకారంతో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ భవనంలో శుక్రవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేరేందుకు ప్రభుత్వం సులభమైన ప్రక్రియ చేపట్టిందన్నారు. హైదరాబాద్ పరిధిలో 30 అంతకంటే ఎక్కువ పడకలు ఉన్న 105 ఆస్పత్రులు ఇప్పటికే ఆరోగ్యశ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారని, అర్హత ఉన్న ఆస్పత్రులు యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ ప్యానల్‌లో నమోదు (ఎంప్యానల్‌మెంట్) చేసుకోవాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతు నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ ఎంతో దోహదపడుతుందని, ఆరోగ్యశ్రీట్రస్ట్ వద్ద పూర్తి సమాచారం ఉచితంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ జక్కుల రాములు, జిల్లా మాస్‌మీడియా అధికారి నరసింహా, మెడికల్ డైరక్టర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతోపాటు 105 ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సూచించారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్ కమ్యూనిటీహాలులో శుక్రవారం జనహిత సేవా ట్రస్ట్, ఆశ్రయ హోమ్, రెయిన్‌బో హోమ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ .. వైద్య ఖర్చుల నిమిత్తం వేల రూపాయలు వెచ్చించ లేని ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, పెడియాట్రీషన్ సేవలు ఈ శిబిరంలో అందించారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గ్రేస్‌మణి, నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీను, సత్తయ్యగౌడ్, మహ్మద్, దేవయ్య, మల్లేష్, రాజు, మహేందర్, శ్రీరామ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ, సంరక్షణలో సమన్వయం ఉండాలి


బ్రోచర్ విడుదల చేస్తున్న అతిథులు

రాంగోపాల్‌పేట్: బాలల రక్షణ, సంరక్షణకు అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పలువురు సూచించారు. శుక్రవారం ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్డీ రోడ్డులోని హస్ భవనంలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా సంక్షేమ శాఖాధికారి అక్కేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి, నల్సార్ యూనివర్శిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ, యూనిసెఫ్ ప్రతినిధి సోనికుట్టి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలల అక్రమ రవాణ, బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ తదితర చట్టాల గురించి సమగ్రంగా చర్చించారు. కార్యక్రమంలో ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజే, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్లు రాజారెడ్డి, నరేందర్‌రెడ్డి, చింత కృష్ణ, నబి, రాజేంద్ర ప్రసాద్, ఆశ్రయ్ డైరెక్టర్ నవీన్‌రాజ్ పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని శ్రీచైతన్య టెక్నో ప్రైమరీ–ప్రీ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆటాపాటలు అందరిని కట్టిపడేశారు. గ్రూపు, సోలో, ఫోక్ సాంగ్స్‌లకు డ్యాన్సులు చేస్తూ అందరిని అలరించారు. విభిన్నమైన నాటికలు ప్రదర్శించి అందరిని ఆలోచింప చేశారు. ఈ కార్యక్రమానికి మెహిదిపట్నం జోన్ ఏజీఎం కృష్ణ, ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ బబిత, డీన్ సురేష్, ప్రైమరీ ఇంచార్జ్ వాణి, ప్రీప్రైమరీ ఇంచార్జ్ జ్యోతి తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు వారికి అభిరుచి ఉన్న వాటిలో రాణించేలా తాము ప్రోత్సహిస్తామని వారు చెప్పారు.

అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన ఫుట్‌పాత్ వ్యాపారులు

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని మినిస్టర్ రోడ్డు, పీజీ రోడ్డు, సింధికాలనీలకు చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు, స్ట్రీట్ వెండర్స్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి తమ ఆవేదనను వ్యక్తంచేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తమ వ్యాపారాలకు అనుమతిస్తున్నప్పటికీ ట్రాఫిక్ సమస్యల పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు జీవనాధారం లేకుండా చేస్తే తమ కుటుంబాలను ఏవిధంగా పోషించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు. అంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి వివిధ రకాల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, నాగులు, టౌన్ వెండింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 108 ఫౌండేషన్ డే సందర్భంగా స్టూడెంట్స్ డీన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4, 5 తేదీలలో అంతర్ కళాశాలల పోటీలను నిర్వహించనున్నారు. శుక్రవారం పోటీల వాల్ పోస్టర్ వీసీ ప్రొ.కుమార్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 2 వరకు విద్యార్థుల పేర్లను నమోదు చేసుకోవాలని వర్సిటీ అధికారులు తెలిపారు.

డాన్స్, మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, లిటరరీ తదితర అంశాలలో సాంస్కృతిక పోటీలు ఉంటాయని సంబధిత అధికారులు వివరించారు. ఏప్రిల్ 26న యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఓయూ 108వ ఫౌండేషన్ డే కార్యక్రమంలో బహుమతులు అందచేయనున్నట్లు పేర్కొన్నారు.

హోమ్ గార్డును అభినందించిన ఏసీపీ

కంటోన్మెంట్: మారేడుపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే హోమ్ గార్డ్ సమయస్ఫూర్తితో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకున్నాడు. బి.సుధాకర్ అనే హోమ్ గార్డు శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ క్లబ్ ఇన్ గేట్ వద్ద జిగ్ జాగ్ బారిగేటింగ్ విధులు నిర్వర్తించి తిరిగి జేబీఎస్ లో అవుట్ పోస్టుకి వెళుతున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు జేబీఎస్‌లో సెల్ ఫోనును దొంగిలించి పారిపోవటాన్ని గమనించాడు. వారిని వెంబడించి చాకచక్యంతో జేబీఎస్ ఇన్ గేట్ వద్ద వారిని పట్టుకొని మారేడుపల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. సుధాకర్ చేసిన మంచి పనిని గుర్తించిన నార్త్ జోన్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ శంకర్ రాజు, సుధాకర్ ను శాలువాతో సత్కరించి అభినందించారు.

భూబదలాయింపు చేసి పేదలకు పట్టాలు ఇప్పిస్తా

ఎమ్మెల్యే శ్రీగణేశ్


ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బస్తీవాసులు

కంటోన్మెంట్: రక్షణ శాఖ, సివిల్ ఏవియేషన్ భూముల్లో నివాసముంటున్న బస్తీవాసులకు భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బస్తీవాసులు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి, ఎమ్మెల్యేను కలిశారు. ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది నాయకులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో 12 కోట్ల మంది బంజారాలు మాట్లాడే గోర్‌బోలి భాషను 8వ షెడ్యుల్‌లో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల గిరిజన విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తెలంగాణలో గల 40 లక్షల మంది గిరిజన బంజారా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుబ్బునాయక్, రమేష్ నాయక్,నందునాయక్, హనుమంత్‌నాయక్, సతీష్ నాయక్, విశ్వనాథ్ నాయక్, రాజశేఖర్ నాయక్, వంశీనాయక్, మోహన్‌నాయక్,కృష్ణానాయక్ పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో 92 మంది పదవీ విరమణ


పదవీ విరమణ పొందుతున్న అధికారులను సత్కరిస్తున్న ఉద్యోగులు

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 92 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సహోద్యోగుల ఆధ్వర్యంలో వివిధ రైల్వే కార్యాలయాల్లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో పదవీ విరమణ చేయనున్న ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్. వివేకానంద, సీనియర్ సెక్షన్ ఆఫీసర్ కే. స్వరూప రాణి, సీనియర్ అకౌంటెంట్ రవికుమార్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ సెక్షన్ ఆఫీసర్ షేక్‌రవూఫ్‌లను తోటి ఉద్యోగులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రచారమేదీ?


శ్యాంలాల్ బిల్డింగ్స్ నుంచి ఫతేనగర్ ఇందిరాగాంధీపురం వైపు వెళ్లే రహదారిలో ఇదీ పరిస్థితి

సనత్‌నగర్: స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర పట్టణ మంత్రిత్వ శాఖ జీహెచ్‌ఎంసీలో పలు సర్కిళ్లలో ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ప్రక్రియ మొదలు పెట్టింది. రేపో మాపో బేగంపేట సర్కిల్‌లో కూడా ఈ సర్వే ప్రారంభం కానుంది. అయితే సిబ్బంది పూర్తి స్థాయిలో ఆస్తి పన్ను వసూళ్లతో పాటు ఎల్‌ఆర్‌ఎస్ పైనే దృష్టి కేంద్రీకరించడంతో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై అవగాహనను అంతగా కల్పించలేకపోయారు. వచ్చే నెల 15 వరకు నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పౌరుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. మీ ప్రాంతంలో రోజూ ఊడుస్తున్నారా? దుకాణాలకు చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నారా? మీ ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయా? స్వచ్ఛ ఆటోల కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా? తదితర ప్రశ్నలను సంధిస్తూ ఈ సర్వే సాగనుంది. అయితే ఆశించినంతగా ప్రచారం సాగకపోవడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలనలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏమేర మార్కులు వస్తాయో వేచి చూడాలి.

బాలుడు అదృశ్యం


సి. రోహన్(ఫైల్)

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి రవీంద్రనగర్ చెందిన నరేష్ కుమారుడు సి. రోహన్(12) ఈ నెల 27న ఉదయం 9 గంటలకు ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. అయితే ఆ తరువాత తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా రోహన్ ఆచూకి లభించలేదు. దీంతో ఓయూ పోలీసు స్టేషనలో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు

గృహిణి అదృశ్యం


శ్రీవాణి

చిలకలగూడ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ గృహిణి అదృశ్యమైంది. చిలకలగూడ ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. సీతాఫల్ మండి డివిజన్ మైలార్‌గడ్డ ఎస్వీ ఎస్‌గల్లీకి చెందిన శ్రీవాణి (54) రామదుర్గా చారి భార్యభర్తలు. ఈనెల 23న భర్తతో గొడవపడిన శ్రీవాణి అదేరోజు రాత్రి 10 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు మోహనాచారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు.

పండగ పూట పస్తులే..

- 'గాంధీ' కార్మికులకు 3 నెలలుగా అందని వేతనాలు
- పిల్లల ఫీజులు, ఇంటి అద్దె కట్టలేక అవస్థలు
- నిర్లక్ష్య ధోరణిలో అధికారులు



గాంధీఆస్పత్రి: ఉగాది పండగ పూట పస్తులు ఉండే పరిస్థితి దాపురించిందని, పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దెలు కట్టలేక అవమానాలతోపాటు ఇబ్బందులకు గురవుతున్నామని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇంటిల్లిపాదీ రోడ్డున పడే దుస్థితి నెలకొందని బావురుమంటున్నారు.

- సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తొమ్మిది ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో 156 మంది స్టాఫ్ నర్సులు, 71 మంది ఆరోగ్యశ్రీ ఉద్యోగులు, 207 మంది ఫోర్త్‌క్లాస్ సిబ్బంది అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రైవేటు సంస్థల కాలపరిమితి 31 డిసెంబరు 2024తో ముగిసింది. స్టాఫ్‌నర్సులు, ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు క్రమపద్ధతిలో వేతనాలు చెల్లించడంతో ఆస్పత్రి పాలనా యంత్రాంగం సిఫార్స్ మేరకు ఐదు సంస్థల కాలపరిమితి మరో ఏడాది పొడిగించారు. వేతనాలు సరిగా చెల్లించకపోవడం, బిల్లుల్లో అవకతవకలు తదితర కారణాలతో సాహితి, సాయి సెక్యూరిటీ, సాయిసేవ సుప్రీం, శ్రీరామ సంస్థల కాలపరిమితి పొడిగించవద్దని గాంధీ యాజమాన్యం జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో సదరు నాలుగు సంస్థలు కాలపరిమితి గతేడాది డిసెంబర్ 31తో ముగిసింది. ఈ నేపథ్యంలో తొలగించిన నాలుగు సంస్థల స్థానంలో నూతన కాంట్రాక్టు సంస్థలకు బాధ్యతలు అప్పగించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి తీవ్రతను ఉన్నతాధికారులకు వివరించి సమస్యను పరిష్కరించాల్సిన ఆస్పత్రి పాలనా యంత్రాంగం తమకేం పట్టనట్లు మిన్న కుండిపోవడంతో దాన్ని ప్రభావం కార్మికుల వేతనాలపై పడిందని ఓ కార్మిక నాయకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కొన్ని కాంట్రాక్టు సంస్థలు పీఎఫ్, ఈఎస్ఐలు కూడా సరిగా చెల్లించడంలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. 207 మంది ఫోర్త్‌క్లాస్ కార్మికులు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నా గత మూడునెలలుగా వేతనాలకు దూరం అయ్యారు. వేతనం రూ. 15,600 చొప్పున 207 మంది కార్మికులకు నెలకు సుమారు రూ.33 లక్షలు (పీఎఫ్, ఈఎస్ఐతో కలుపుకుని) మూడు నెలలకు కోటి రూపాయలు బకాయిలు కార్మికులకు చెల్లించాల్సి ఉంది. వేతనాలు అందితే ఉగాది పర్వదినాన్ని సంతోషంగా గడుపుకుంటామని సంబరపడిన కార్మికులు పండగ రోజు కూడా పస్తులు తప్పవని ఊసూరుమంటున్నారు. తొలగించిన నాలుగు కాంట్రాక్టు సంస్థల స్థానంలో కొత్త సంస్థలకు అవకాశం కల్పించారని, త్వరలోనే వాటితోఒప్పందం (ఎంఓయు) చేసుకుని కార్మికుల వేతన బకాయిలు చెల్లిస్తామని ఆస్పత్రికి చెందిన ఓ అధికారి తెలిపారు.